# పంఛీ కాహె హోతు ఉదాస్?

మామూలు మొగుడూ పెళ్ళాల మధ్య ఉత్తరాలు రాసుకోడానికి ఏం సంగతులుంటాయి? చాకలి బట్టల పద్దు గురించి, కడిగి బోర్లించిన గిన్నెల గురంచీ, వూరగాయ జాడీలగురించి, మందులు రోగాలు డబ్బు గొడవలు అనారోగ్యాలు మినహా రాసుకోడానికి గుండెలో దాచుకోవలసిన సంగతులేం వుంటాయి దంపతుల మధ్య... ఆ మంచం ఆ మొగుడూ ఆ వంటిల్లు ఆ మురికి బట్టలూ ఇరుకు గదులూ తిట్టుకోడాలు కొట్టుకోడాలు, రోషాలు యింతేగా జీవితం? రోజుకి ఎనిమిది పదిగంటలు ఆ ఆఫీసుల్లో కుర్చీల్లో అఘోరించి వాడిచేత మాటలుపడి వీడిచేత తిట్లుతిని లోపల యేడుస్తూ పైకినవ్వుతూ చాకిరీ చేసేది ఆ రూపాయల కోసమేగా.... రూపాయలు లేకపోతే రోజులు గడవనప్పుడు ఆకాశంకేసి చూస్తూ నక్షత్రాలు లెక్కపెడుతూ పెళ్ళాన్ని ముద్దులాడుతూ చెవిలో గుసగుసలు చెబుతూ ఆడుకుంటూ పాడుకుంటూ తింటూ తిరుగుతూ వుండాలంటే యీ రోజుల్లో సాధ్యం కాదుగదా!

మగాడికి ఉద్యోగంతో ఆడదానికి పెళ్ళి పిల్లలు కనడంతో జీవితం మీద తెరపడుతుంది. ఆ స్నానాలు, ఆ మళ్ళు, పూజలు ఆ మంగళహారతులు ఆ దేవుళ్ళ దగ్గర దేవురింపులు ఆ వ్రతాలు ఆ ఆచారాలు ఆ డాబులు అన్నీ ఎందుకు? పాపాలు కడిగేసుకుందుకు ముక్తికాంతో ముక్తి పురుషుడోవచ్చి వుద్ధరించడం కోసం.... కుళ్ళు మనుష్యులకి వారి తాలూకు కల్మషాన్నంతా దాచుకుందుకు, ఆదర్శాలూ దేవుడూ మొక్కు బళ్ళూ కావాలి.

మేక, ఆకులు రెమ్మలు నవుల్తోంటే చూడ ముచ్చటగా వుంటుంది. పిచ్చిక ముక్కుతో పుడకలు, గడ్డిపరకలు మెత్తనియాకలు తెచ్చి గూడు కట్టుకుంటే ఎంతో అందంగా వుంటుంది చూడ్డానికి – నీళ్ళల్లో మిలమిలా మెరిసిపోతూ జారే ప్రవాహంలో బాతులు ఈదుతోంటే కనకన రుచిరా అనిపించదూ? ఆకాశంలో బారులు తీర్చి రకరకాల పక్షులు ఎగుర్తోంటే చూడ్డం ఎంత బావుంటుంది? హంసల్లాగా ఏనుగుల్లాగా రంగురంగుల్తో కదిలే మబ్బులు, ఇసుక తిన్నెలమీంచి పొంగి పొర్లే ప్రవాహాలు, ఊళ్ళు కొండలు, పూలు,చెట్లు, యింత అందమైన సృష్టిలో జీవించే మనిషి రోజూ ఏం చేస్తాడో తెలుసా?

రెండు చేతుల్తో అన్నాన్ని పిసికి గుండ్రంగా ముద్దలు చేసి గుటుకు గుటుకు మ్రింగుతాడు. అబ్బ – మనుష్యులు తిండి తింటూంటే చూడ్డానికి పరమ రోతగా వుంటుంది. కొరుకుతాడు. చీల్చుకుతింటాడు. అన్నీ నాకే కావాలంటాడు. సృష్టికి ఆదినాథుడ్నని విర్రవీగుతాడు. ప్రకృతిని జయించాలని గప్పాలుకొడతాడు. మళ్ళీ తను సృష్టించిన రాయిరప్పకే మహిమ కలదని సాగిమొక్కుతూంటాడు. గాలి నీరు ఆకాశం భూమి ఈ సృష్టి సమస్తం తనదనుకుని దస్తావేజులు రాసుకుంటాడు బాంబులు ప్రేలుస్తాడు. గొప్ప వంశం అంటాడు. గొప్పకులం అంటాడు. గొప్ప జాతివాడ్నంటాడు. మనుష్యుల మీదనుంచి నడిచి వెళ్ళి ఎత్తున కూర్చుంటానంటాడు.

మారణ హోమాలు తలపెడ్తాడు నల్లవాడి వంటాడు తెల్లవాడి వంటాడు. కొట్లాటలూ లేకుండా వుండలేడు యుద్ధాలు తలపెట్టి వీరత్వం పౌరుషం దేశభక్తి దేశద్రోహం శత్రువు మిత్రుడు అంటాడు. మనిషి నిలువు నిలువంతా అసూయ మోసం దగా. దేవతల్ని తానే సృష్టించాడు. దానవుల్ని తానే సృష్టించాడు. ఎల్లప్పుడు తనెక్కిన చెట్టు కొమ్మ తనే నరుక్కుంటాడు. తన మీదకు తనేబండరాళ్ళను దొర్లించడం తన కొంపకు తనే అగ్గి పెట్టుకోడం మనిషికి చాలా ఇష్టం!

ఆ వారసత్వమే యిప్పుడు మనకు సంక్రమించింది. చిరునవ్వులు చూడలేం. బోసి నవ్వుల పసిపాపలను అసహ్యించుకుంటాం. ఏవేవో పెద్ద పెద్దవి చేసెయ్యాలని బోర్లపడడం మానం. కీర్తి దాహం డబ్బు దాహం ఈ రెండూ చల్లారే దెల్లా.... దోచుకోడం దాచుకోడం మానేదెప్పుడు? ఇంత ఫిలాసఫీ ఇప్పుడు ఎందుకు దొర్లుకొస్తోందంటే ఈ మూర్ఖప్రపంచానికి దయ, శాంతం, సహనం, సానుభూతి, ఔదార్యం ఇన్ని మంచి లక్షణాలు నేర్పేశక్తి స్త్రీలకుంది. అందుకే సృష్టిలో స్త్రీనిస్తన్యమిచ్చి సాకమన్నది తల్లిగుణం లోపించడంవల్నే క్షమా దయా గుణాలు లోపించినై... మన పిల్లడికి టిఫిన్ పెట్టి పక్కవారి పిల్లడు తొంగిచూస్తోంటే ఛీ పొమ్మని కసిరేస్తాం. వీధిలో ముష్టాడునుంచుని మాధాకబళం తల్లీ అని అరుస్తోంటే వినిపించుకోం. చెయ్యి వూరుకోదు. ఎండినరొమ్ముల్ని చీకుతూ ఏడ్చే వీధిలోని దిక్కుమాలిన ఆడమనిషి పిల్లడికేదన్నా పెట్టమంటే అసహ్యంగా చూస్తాం. నా చిన్న బొజ్జకు శ్రీరామ రక్ష... మనం నిజంగా పశువులకన్నా కనిష్టంకాదంటారా? సభ్యతకోసం గొప్పకోసం నెత్తిమీద జుట్టుదగ్గరనుంచి గొరిగించి యిస్తాం – ఎందుకు? మనం చేసే వెధవపనన్నటికీ ఓ కాపు కాసేస్తాడని ఆ జగన్నాటక సూత్రధారి. ట్రాన్స్‌ఫరు చేయించమనీ, ప్రమోషన్లు తెమ్మనీ, కరప్షన్ కేసు కొట్టేయించమనీ, పదువులు కావాలనీ మొక్కుకుంటాం; బేరాలాడ్దాం; గర్వంతో అహంకారంతో డబ్బును చూసుకుని ఉజ్జోగాన్ని చూసుకుని మేడలు, తోటలు, దొడ్లు వ్యాపారాన్ని చూసుకుని విర్రవీగుతాం; పిచ్చిక గూళ్ళను పడకొడ్తాం? బురద చిమ్ముకొంటాం;

ఇచ్చట అంతా క్షేమం తర్చా మీక్షేమం వ్రాయించవలెను అనిరాస్తాం కాని నిజంగా మన కెవరి క్షేమమూ అక్కర్లేదు. మన ఉత్తరాలలో ఎక్కడా జవం జీవం తొణికిస లాడదు. ఇక్కడ సెనగపప్పు దొరుకుటలేదు. నాలుగు శేర్లుకాదు కేజీలు బంపవలెను అని రాసి అండర్‌లైన్ చేస్తాం. కందిపప్పు డబ్బాల్లోంచి ఊరగాయ జాడీల్లోంచి మన స్త్రీలను మెడ పట్టుకు పైకి లాగి ఆలోచించడం నేర్పాలి. లేక పోతే రేపటి ఆకాశంలోని ఆశల హరివిల్లు కేసి చూడ్డం మాని, గోరుచిక్కుడు కాయలు ముందేసుకుని గిల్లుకుంటూ కూర్చుంటారు. మన వనితలు వంటింట్లోంచి పొగగూట్లోంచి తలలెత్తి సామాజిక జీవనంలో బహుళ సంఖ్యలో అడుగు పెట్టి పాలు పంచుకోనిదే భూమి మీద స్వర్గం ఎక్కడ్నుంచి వస్తుంది? ఇప్పటికే మనం ప్రయోజకులు అనుకుంటున్న ఈ మగరాయుళ్ళు తమ బొజ్జెంక మీసాల్తో బోడిగుళ్ళతో బట్టతలల్తో మొత్తం ప్రపంచ రూపురేఖల్ని తారుమారు చేసి ధ్వంసం చేసేశారు.

ప్రపంచ జనాభాలో సగానికి పైగావున్న స్త్రీలు చూస్తూవూరుకుంటే ఈ మానవ కల్యాణానికి నొసటను కుంకుమ బొట్టును ఎవరు తీర్చి దిద్దుతారు?

పంఛీ కా హె హోతు ఉదాస్....

# పోస్టుచేయని ప్రేమలేఖలు

గాజులు ముంజేతిపైకి లాక్కుని మణియార్డరు ఫాంమీద సంతకం పెడుతుంటే పోస్టు మేన్ కేసి కొరకొరా చూస్తూ నిలబడ్డ జానికమ్మత్త "నీ దస్తూరి ముత్యాలకోన - ఆ సంతకం చూసి మురిసిపోడూ అతగాడు" అని నన్నూ, నా మొగుడ్నీ, నా సంతకాన్ని పొగిడి పది రూపాయలట్టుకు పోయింది చచ్చి నీ కడుపునపుడతానంటూ - జానికమ్మత్త నోట్లో వున్న రెండంగుళాలన్నర నాలిక ఎట్లాపడితే అట్లా తిరుగుతూ వుంటుంది.

"ఏవిటి ఆ ఉత్తరం చేతిలో..."

"మీ ఆయన రాశాడా, ఎక్కడ్నుంచి?"

"అంతా కులాసా... ఏ వంటున్నాడు. భోజనం సదుపాయంగా లేదంటున్నాడా!"

వెకిలి నవ్వు పళ్ళు బైటబెట్టి... ఏం ఆడాళ్లో ఉత్తరం చదువుకో నివ్వరు.

"తిన్నగా వుంటాడా ఏమో నమ్మలేము. ఈ కాలం కుర్రాళ్ళు.... మీ ఆయన సంగతి కాదు నేను చెప్పేది. అతనికేం బుద్ధిమంతుడే."

"డబ్బు జాగర్తచేసి వుంచమను. బంగారం కొనమను. ఏవన్నా చేయించుకో - ఇది చేయించుకోవడం గొప్పకాదు. దీనికేం అందరికీ అయేదేగా - పిలవకుండా వస్తుంది. గుడ్డలూ గుడుసుల కోసం తగలెయ్యకండి వెర్రి మొహాలు.... నాలుగు కాసులుకొని చేయించుకుని ఏవన్నా మెళ్ళో వేసుకుంటే నిండుగా వుంటుంది. పచ్చని పిల్లవు. కాపరానికెళ్ళి ఎన్నాళ్ళయింది? జడగంటలు, నాగరం చెరిపించేసి నెక్లెసు చేయించుగున్నావా? అయ్యో తెలివి తక్కువ పిల్లా - రేపు ఓ పిల్ల బయల్దేరితే అది పెట్టుకోదూ? కనిపెంచే తల్లివి - ముందుచూపు లేకపోతే ఎల్లాగ? ఈ చీర వాళ్ళు పెట్టారా.... బాగుందమ్మా! చిలకలా వున్నావు. ఏవిటా ఉత్తరం? యింకా ఏవేం రాశాడే.... ఏవంటాడూ! వుండలేనంటున్నాడా - దొబ్బుడాయి, ఉత్తరాల్లో అట్లాగే రాస్తారు ఈ మగాళ్ళు! నమ్మకు - నీకు కోపం రాకుండా వుంటే వోమాట చెబ్తా.... అంతలా చనువియ్యకూడదు. తగు మాత్రం దూరంలో వుంచాలి. వుంచితేనే మగాళ్ళు.... ఈ ప్రేమలూ దోమలూ అంటే నాకు డోకు. సాయంపడుకుంటాలే. దీపం ముందేసుకు కూర్చుని ఆ వెర్రి మొర్రి పుస్తకాలూ అవి ఎందుకు వర్తినే చదవడం? పుణ్యమా పురుషార్థమా వో భక్తా ముక్తా - దిక్కుమాలిన రాతలు తలకు పట్టేస్తే బుర్ర తిరిగిపోతుంది. చదవకు. సుబ్బరంగా